క్లుప్తంగా...

ఓటరు నమోదుపై అవగాహన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ముగ్గులతో అవగాహన

మేడ్చల్: ప్రజాస్వామ్యానికి దేశంలో పునాది ఓటేనని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. ఓటు నమోదుపై నిర్వహించిన ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐదేళ్లకోసారి నిర్వహించే ఎన్నికల్లో ఓటు వేయడం ద్వారా దేశ భవిష్యత్‌ను ఎన్నుకోవచ్చని అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆర్‌పీలు ముగ్గులు వేసి రంగవల్లుల ద్వారా అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ రాం చందర్, మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

కీసర: సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ..ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి యేడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించడం ఆనవాయితీగా వస్తుందని ఈఏడాది సెప్టెంబర్ 5న అనివార్యకారణాల వల్ల కార్యక్రమం నిర్వహించలేదని అందుకు సోమవారం ఉపాధ్యాయులను సత్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు మమత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



కీసర: కీసర మండల క్రిస్టియన్ సిమిట్రీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడిగా పిలిప్‌మాదాసు, ప్రధాన కార్యదర్శిగా సాల్మారాజ్, జాయింట్ సెక్రటరీగా పాల్‌డేవిడ్, ట్రెజరర్‌గా గ్రాబియల్ ఆర్‌కె యెల్లా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా జయరాజు, డేవిడ్‌బాబు, సూరజిత్‌పాల్, రాజేష్, అడ్వైజర్‌మెంబర్స్‌గా దేవదాస్, సుధాకర్‌రావు, పాల్‌జోషఫ్ తదితరులు నియమితులయ్యారు.

ముగిసిన బోనాల ఉత్సవాలు



అలియాబాద్‌లో రంగం కార్యక్రమం

శామీర్‌పేట్: అలియాబాద్ గ్రామంలో జరుగుతున్న బోనాల ఉత్సవాలు సోమవారం తో ముగిశాయి. ఆలయం వద్ద భవిష్యవాణి (రంగం) చెప్పగా, సర్వగంప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు మహంకాళి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు సమర్పించారు. దీంతో గ్రామమంతా అమ్మవారి నామ స్మరణలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమార్‌యాదవ్, రైతుబంధు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు అశోక్, శ్రీనివాస్‌యాదవ్, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం



మేడ్చల్: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వాఖ్యలను నిరసిస్తూ మేడ్చల్‌లో బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాషాయజెండాలతో ప్రదర్శన నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకు జాతీయ రహదారిపై స్టాలిన్ దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రంరెడ్డి, మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జగన్‌గౌడ్, బుద్ధి శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రేంకుమార్, నరెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ట్యాక్స్ డబ్బులు గోల్‌మాల్?

- ఏడాదిగా నమోదు చేయని చిట్టా
- ఆడిటింగ్ జరుగుతుండగా అదృశ్యమైన కంప్యూటర్ ఆపరేటర్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ప్రత్యేక ఆడిటింగ్ కలకలం రేపుతోంది. బ్యాంకులో ట్యాక్స్ డబ్బులు డిపాజిట్‌లో అవకతవకలు జరిగినట్లు అనుమానం రావడంతో కమిషనర్ ప్రత్యేక ఆడిటింగ్ చేయిస్తున్నారు. ఆడిటింగ్ జరుగుతుండగానే కంప్యూటర్ ఆపరేటర్ (షరఫ్) బ్యాంకులో డబ్బులు జమచేసి చిట్టా రాసే వ్యక్తి అదృశ్యం కావడంతో గోల్‌మాల్‌పై పుకార్లు జోరందుకున్నాయి. మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్లు ప్రజల నుంచి ట్యాక్స్ రూపేనా వసూలు చేసిన డబ్బులు మున్సిపల్ కార్యాలయంలో ఉండే కంప్యూటర్ ఆపరేటర్‌కు అప్పగిస్తారు. బిల్ కలెక్టర్లు వసూలు చేసిన ట్యాక్స్ డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేసి చిట్టా రాయడం ఆయన విధి. మూడు నాలుగు నెలలుగా జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించిన సమయంతో పాటు ఏడాదిగా బ్యాంకులో జమచేసిన డబ్బుల చిట్టా నమోదు చేయడం లేదు. దీంతో గోల్‌మాల్ జరిగినట్లు మున్సిపల్ అధికారులు, ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆడిటింగ్ జరుగుతుండగానే అదృశ్యం..

ట్యాక్స్ చిట్టా నమోదుపై మున్సిపల్ కార్యలయంలో ఆడిటింగ్ జరుగుతుండగా చిట్టా నమోదు చేసే కంప్యూటర్ ఆపరేటర్ ఈనెల 7న అదృశ్యమయ్యాడు. ఈ విషయమై అతడి భార్య 8న పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. అదృశ్యమైన రోజు రాత్రి పూణే వెళ్లినట్లు తేలింది. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అనారోగ్యం, కుటుంబ కలహాల కారణంగా అక్కడికి వెళ్లినట్లు ప్రచారం కూడా సాగుతోంది.

ఏడాదిగా నమోదు కాని చిట్టా..

ట్యాక్స్ డబ్బులు చిట్టా ఏడాదిగా నమోదు చేయడం లేదు. ట్యాక్స్ గోల్‌మాల్ వ్యవహారం, బిల్ కలెక్టర్లు, షరఫ్ పాత్ర ఆడిటింగ్ అనంతరం బయట పడనుంది. ఏడాదిగా ట్యాక్స్ వసూలు, డిపాజిట్‌లో తేడాలున్నట్లు లక్షల రూపాయల స్కామ్ జరిగినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఆడిటింగ్ చేయించాలని కమిషనర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడని మున్సిపాలిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పైసా పైసా జమచేసి చెల్లించిన ట్యాక్స్ నిధుల గోల్‌మాల్ వ్యవహారం నిగ్గు తేల్చాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

కీసర: క్రైస్తవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి నాగారం మున్సిపాలిటీలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాగారం క్రిష్టియన్ సెల్ అసోసియేషన్ ప్రారంభోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాగారం మున్సిపాలిటీలో ఉన్న క్రైస్తవులందరూ ఒక్కతాటిపైకి వచ్చి అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ గ్లోరీ, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పాస్టర్ సల్మాన్ రాజ్, బిషప్‌లాజరస్ లాల్‌సింగ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు పంగ హరిబాబు, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో మహేందర్‌రెడ్డి, నాయకులు

మేడ్చల్ రూరల్: గండ్లపోచంపల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి దంపతులు సోమవారం భూమి పూజ చేశారు. వేద పండితులతో కలిసి చైర్‌పర్సన్ దంపతులు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, నాయకులు భూమి పూజ, ప్రత్యేక పూజలతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాలరాజ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి



అనురాగ్ యూనివర్సిటీలో అవగాహన కల్పిస్తున్న మల్లేశ్

ఘట్‌కేసర్: అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ యూనిట్-1 ఆధ్వర్యంలో సోమవారం ఓటు హక్కు నమోదుపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు దేశాభివృద్ధికి సరైన నాయకుడిని ఎంపిక చేసుకునే వజ్రాయుధమని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 1950 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాబారావు, నవీన్, సీనియర్ వలంటీర్లు సింధు, మనీష్, శాంతశ్రీ పాల్గొన్నారు.

'పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు'



డీపీఓ రమణామూర్తికి ఫిర్యాదు చేస్తున్న కొర్రెముల్ వార్డు సభ్యులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ పంచాయతీలో సర్పంచ్ అక్రమార్కులతో కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నాడని ఆరోపిస్తూ పలువురు వార్డు సభ్యులు అదనపు కలెక్టర్, డీపీఓకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో సుమారు 20 భవనాలకు 14 శాతం ట్యాక్స్ ద్వారా అనుమతి ఇస్తానని పలువురి ఇంటి యజమానుల నుంచి డబ్బులు తీసుకున్నాడని, 14 శాతం ట్యాక్స్ చెల్లించిన వారికి కూడా అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నాదని ఫిర్యాదులో ఆరోపించారు. సమావేశంలో చట్ట ప్రకారం విధులు నిర్వర్తించక సభ్యులను అవమానిస్తున్నాడని, ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి అందజేసిన వారిలో వార్డు సభ్యులు దుర్గరాజ్, భాస్కర్, స్వామి, బాబు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శామీర్‌పేట్: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి అశోక్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని అంగన్‌వాడీ టీచర్‌లు శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం అదనపు పనులను అప్పగిస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి



ఉప్పల్: విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు అశ్వని కుమార్ శర్మ ప్రధాని నరేంద్రమోదీని కోరారు. సెప్టెంబర్ 17వ తేదీని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంఘాలు విశ్వకర్మ జయంతిని నిర్వహిస్తాయని గుర్తు చేశారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అఖిల భారత విశ్వకర్మ మహాసభ ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 17న విశ్వకర్మ కౌశల్ యోజన పథకాన్ని ప్రారంభిస్తున్న కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుభాష్ చంద్రబోస్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజమౌళిచారి, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌శర్మ, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు ఓపీ పుస్తకాలు అందజేత

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్ బస్తీ దవాఖానాకు కౌన్సిలర్ బొక్క సంగీత 200 ఓపీ పుస్తకాలను సోమవారం విరాళం ఇచ్చారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై వైద్యుడు ప్రదీప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఓపీ పుస్తకాలు లేక వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని గమనించి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, రమేశ్, రహీం పాల్గొన్నారు.



ఓపీ పుస్తకాలు అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ సంగీత

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



రాంపల్లిదాయర గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: మౌలిక వసతుల కల్పనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు మల్లారెడ్డి శ్రీకారం చుట్టారు. యమ్నంపేట్‌లో రూ.20 లక్షలు, 3వ వార్డులో రూ.5 లక్షలు, 17వ వార్డులోని ఎమ్మెస్సార్ కాలనీలో రూ.10 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 11వ వార్డులోని బతుకమ్మ గుడి వద్ద సొంత నిధులతో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. 15వ వార్డులో రూ.50 లక్షల సీడీపీ నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందన్నారు. పోచారం మున్సిపాలిటీలో రూ.1.17 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం ఎల్‌ఎన్ కాలనీకి చెందిన 100 మంది మంత్రి సమక్షాన బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి లక్ష్మి, నర్రి ధనలక్ష్మి, అబ్బవతిని సరిత, సుర్వి సుధాలక్ష్మి, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం ..

కీసర: ప్రభుత్వ స్థానిక సంస్థల బలోపేతానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం రాంపల్లిదాయర గ్రామంలో కొత్తగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ నూతన భవనంతోపాటు, మహిళా భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, సర్పంచ్ ఆండాలు మల్లేష్, ఉపసర్పంచ్ రాము, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ కార్మిక సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా విజయ్‌ముదిరాజ్



శామీర్‌పేట్: తెలంగాణ రాష్ట్ర బీసీ కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా తుర్కపల్లికి చెందిన దాసరి విజయ్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేస్తానని, బీసీల ఆర్థిక అభివృద్ధికి అవసరమయ్యే చర్యల దిశగా పనిచేస్తానని విజయ్‌ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేమూరి శివగౌడ్, మహేశ్, భూపాల్, అశోక్, యాదగిరి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



అఖిల (ఫైల్)

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాజీనగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసించే తాటికొండ పాండు, భార్య పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. పాండు చిన్న కుమార్తె అఖిల (19) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతుంది. సోమవారం కడుపు నొప్పితో బాధపడుతుండటంతో నిమ్మరసం తాగేందుకు నిమ్మకాయలు తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నర్సింహ్మాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన సోమయ్య(48) మేడ్చల్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం కూలీ పనులకు వెళ్లేందుకు మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద 44వ జాతీయ రహదారి దాటుతుండగా అదే సమయంలో నగరం నుంచి మేడ్చల్ వైపు వేగంగా వస్తున్న లారీ సోమయ్యను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రూపారెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడలోని రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పిర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో 168 మంది క్రీడాకారులు పాల్గొనగా రోటర్ డ్యామ్ స్కూల్, దేవేంద్ర విద్యాలయ స్కూల్, మెరిడియన్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, క్రీడాకారులకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తుంపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి, అసొసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్‌నాయర్, కార్పొరేటర్ శారదా, డైరెక్టర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని లోటస్ ల్యాప్ స్కూల్‌కు గ్లోబల్ బెర్ట్స్ సంస్థ కె 12 డబ్ల్యూడబ్ల్యూ అవార్డు అందజేసింది. నగరంలో జరిగిన కె 12 గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి శిక్షకుడిగా వెళ్లారు. ఇక్కడ విద్యావ్యవస్థపై మార్పు తీసుకురావడానికి వివిధ శిక్షార్థ చర్చలు జరిగాయి. విద్యాపరమైన ప్రదేశాల్లో సాంకేతికత యొక్క అనువర్తమాన్ని పునఃపరిశీలించడం, భవిష్యత్ అభ్యాస నమూనాలు, విద్యార్థుల అభ్యసన అభిరుచులకు అనుగుణంగా బోధన జరగాలని తదితర అంశాలపై గోపాల్‌రెడ్డి వివరించారు. దీనిపై స్పందించిన గ్లోబల్ బెర్ట్స్ సంస్థ ప్రతినిధులు లోటస్ ల్యాప్ స్కూల్‌కు అవార్డు ప్రకటించి అందజేసినట్లు వెల్లడించారు. తమ స్కూల్‌కు ఈ అవార్డు రావడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తాం



మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద సకాలంలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తామని మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు అన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు శ్రవణ్, సునీతా యాదవ్, మేకల సునీతాయాదవ్, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... పండగ ప్రారంభం కన్నా ముందే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. నిమజ్జనం రోజున భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, నాగరాజు పోలీస్ విభాగం వారికి సహకరించి నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలని కోరారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ... నిమజ్జనం రోజుల్లో ట్రాఫిక్ మళ్లింపుతో పాటు, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయిస్తామన్నారు. డీసీ రాజు మాట్లాడుతూ... గత ఏడాది నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించానని, అప్పుడు వచ్చిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సకాలంలోనే ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. గణేష్ ఉత్సవ సమితి నాయకులు పలు సూచనలు చేస్తూ వినతిపత్రం అందజేశారు.ఈఈ లక్ష్మణ్, జీఎం సునీల్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏసీపీ శ్రీనివాస్‌యాదవ్, ఏడీఈ యాదగిరి ల్గొన్నారు.